క్లుప్తంగా

అమ్మవారికి బోనాల సమర్పణ



కనకదుర్గమ్మకు బోనాలు తీసుకెళుతున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద గల కనకదుర్గమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న శ్రీవరసిద్ధి వినాయక అభయాంజనేయస్వామి గుడి వద్ద పూజలు నిర్వహించి, అక్కడి నుంచి మహిళలు బోనాలు శిరస్సున ధరించి కనకదుర్గమ్మ గుడికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో లలితా శాస్త్ర గ్రూపు బృందం, మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంభాభిషేకం



చింతాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పాల పొంగళ్లను వండుతున్న మహిళలు

కొయ్యలగూడెం: గ్రామ దేవత శ్రీచింతాలమ్మకు కుంభాభిషేకం ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల వద్ద నుంచి పారాణి కలిపిన నీళ్లను తీసుకొచ్చి గర్భగుడిలో కొలువైన అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద మహిళలు పాల పొంగళ్లను వండి అమ్మకు నైవేద్యంగా సమర్పించారు. గరగలను ధరించిన రజకులు ఊరేగింపుగా పుట్టినింటి నుంచి అంకాల చెరువుపై కొలువైన అమ్మవారి మెట్టినింటి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి ఆలయంలో అమ్మవారికి జలాభిషేకాలు చేశారు.

శ్రీవారి విద్యాదాన పథకానికి విరాళం



విరాళం చెక్కును ఆలయ ఈఓకు అందజేస్తున్న దాత దంపతులు

ద్వారకాతిరుమల: శ్రీవారి విద్యాదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం రూ. 1,00,116 లను విరాళంగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా మల్లవరంకు చెందిన కోర్పు వెంకటరాజు, హైమావతి (జ్యోతి) దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళం చెక్కును ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తికి అందించగా, ఆయన దాత దంపతులకు విరాళం బాండ్‌ను అందజేశారు.

ఆలయానికి విరాళం అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు విరాళాలను సమర్పిస్తున్న సుబ్బారావు

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ. 1,11,111 విరాళం అందినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం భక్తులు, ఆయిల్ వ్యాపారి కొంపెల్ల సుబ్బారావు బ్రదర్స్ విరాళాన్ని అందించారన్నారు. పోతవరం రోడ్డులో రూ.35 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఆలయ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ప్రస్తుత ఆలయానికి వెనుక ఆలయాన్ని నిర్మిస్తున్నామని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో దేవేరులతో సహా స్వామి వారికి నిత్య పూజాకైంకర్యాలు అందిస్తున్నామన్నారు. మేకల అన్నవరం, మంతెన సోమరాజు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మంచాల వెంకయ్య నాయుడు, కొంపెల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి సంబరం

పెదపాడు: మండలంలోని పెదపాడు శివారు రామచంద్రపురంలో గంగానమ్మకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పసుపు కుంకుమ నీళ్లతో మహిళలు అభిషేకం నిర్వహించారు, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి సారె చీరలను పట్టుకొని ఊరేగింపుగా బయలుదేరి సారె సమర్పించారు. అనంతరం కొత్తూరులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్దకు కాలినడకన వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పాలాభిషేకాలు నిర్వహించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి దారుణం

- కూటమి పాలనలో శాంతి భద్రతలు అస్తవ్యస్తం
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న పోలీసులు
- మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నేతలు



మాగసాని గురుబ్రహ్మం, వైఎస్సార్ సీపీ నేత

చింతలపూడి: ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక మూలన వైఎస్సార్ సీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులపై రాజకీయ కక్షతో హత్యలు చేయడం, దాడులు చేయడం, కార్లు, ఇళ్లు ధ్వంసం చేయడం వంటి దారుణాలకు ఒడిగడుతున్నారన్నారు. అక్రమ అరెస్టులు దళితులని, మహిళలని అవమానించడం, బూతు పద జాలాలు వాడడం వంటి దారుణమైన సంఘటనలు కూటమి ప్రభుత్వంలో ఇంకా నాలుగు సంవత్సరాలు భరించాల్సి వస్తుందని వాపోయారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయన్నారు. వీటిని అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక జిల్లా ప్రథమ మహిళను, తన భర్తను కార్‌లో నుంచి దిగకుండా భయభ్రాంతులకు గురి చేసి కారుపై కర్రలతో దాడులు చేశారన్నారు. పవన్ కళ్యాణ్ ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే ఊరుకోను అన్న మనిషి ఈ రాష్ట్రంలో ఆడబిడ్డలపై దాడులు, అత్యాచారాలు జరుగుతుంటే ఏమి చేస్తున్నాడని ప్రశ్నించారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

బీసీ మహిళా నేతపై దాడి హేయమైన చర్య

ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు చేసిన దాడి అత్యంత దారుణమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మాగసాని గురుబ్రహ్మం అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడుతూ ఒక బీసీ మహిళపై టీడీపీ, జనసేన రౌడీ మూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేదన్నారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

కూటమి పాలనలో దౌర్జన్యకాండ

కొయ్యలగూడెం: కూటమి పాలన దౌర్జన్య కాండతో కొనసాగుతోందని జిల్లా గౌడ సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చిటికిన శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ప్రథమ పౌరురాలు బీసీ మహిళ ఉప్పల హారిక మీద టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆటవిక పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా కూటమి ప్రభుత్వం మారిందని వెంటనే గవర్నర్ జోక్యం చేసుకొని పరిస్థితులను అదుపులోకి తీసుకురావాలన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ గుడివాడ నియోజవర్గ కార్యక్రమానికి హాజరవుతుండగా ఉప్పల హారికపై దాడి హేయమైన చర్య అన్నారు. గుడివాడ ఎమ్మెల్యే బీసీల మీద దాడులు చేయించడంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉప్పాల హారికపై దాడి అమానుషం



లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సందీప్

లింగపాలెం: జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి అమానుషమని ఏపీ లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ విలేకరుల సమావేశంలో ప్రకటన వెలువరించారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామని, రాజకీయ దాడులు సంస్కృతి మన రాష్ట్రంలో, మన ప్రాంతాల్లో లేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి నిత్యం ఏదో ఒక మూలన వైఎస్సార్ సీపీకి చెందిన వారిని కక్షలతో హత్యలు చేయడం నరకడాలు, దాడులు చేయడం కార్లు, ఇళ్లు ధ్వంసం చేయడం వంటి దారుణాలను చూస్తున్నాం. జిల్లా ప్రథమ మహిళను, తన భర్తను కార్ లో నుంచి దిగకుండా కారుపై కర్రలతో దాడులు చేశారని ఇలాంటి చర్యలు పునరావృతమైతే కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి హేయమైన చర్య



మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి హేయమైన చర్య అని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి హాజరవ్వటానికి వచ్చిన హారికపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒక మహిళ జిల్లా ప్రథమ పౌరురాలికి భద్రత లేని ఈ రాష్ట్రంలో స్త్రీలు ఎలా తిరుగుతారని ప్రశ్నించారు. ఒక ప్రజా ప్రతినిధిపై ఇలా దాడి చేస్తుంటే పచ్చ మీడియా ఏం చేస్తుందన్నారు. ఒక బీసీ ప్రజా ప్రతినిధికే రక్షణ లేకుండా పోతే ఎలాగన్నారు. ఈ చర్యలు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని చైర్‌పర్సన్ అన్నారు.

ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల గ్రామ కమిటీలు ఏర్పాటు

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల గ్రామ కమిటీ నిర్మాణం చేస్తున్నట్లు ఆ సంఘ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి విసుంపల్లి సిద్ధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో ఆ సంఘ మండల కన్వీనర్ నార్లపాటి చిన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించామని ఈ సమావేశంలో కె. త్రిమూర్తులు, కె. వెంకటసాయి, కలపాల చందులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామ కమిటీ అధ్యక్షులుగా కోటా శ్రీను, ఉపాధ్యక్షులుగా తగరం పోలయ్య, కార్యదర్శిగా నార్లపాటి వెంకటేశ్వరరావు తోపాటు మరొక 16 మందిని కమిటీగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మల్లికార్జున, డి. రమేష్, జాను, రాజేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహేంద్ర (మేదరి) కులస్తులను ఎస్టీలో చేరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని మహేంద్ర (మేదరి) సంఘం రాష్ట్ర అధ్యక్షులు జోరిగే మస్తానరావు కోరారు. జంగారెడ్డిగూడెంలోని చంద్రశేఖర కల్యాణ మండపంలో జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా, పట్టణ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హక్కులను కాపాడాలని కోరారు. న్యాయపరంగా ఎస్టీలో ఉండాల్సిన మేదరి కులస్తులను, బీసీలుగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రలో తాము ఎస్టీలుగానే ఉన్నామని గుర్తు చేశారు. తమ కుల సంఘం పేరిట కనీసం కమ్యూనిటీ హాల్స్ కూడా లేవన్నారు. రాబోయే కాలంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తమ సమస్యలను ప్రశ్నించాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా తమదైన శైలిలో విధులు, హక్కుల కోసం ముందుకు వెళతామన్నారు. కుల వృత్తిని నేటి తరం కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సూచించారు. త్వరలోనే సీఎం నారా చంద్రబాబు నాయుడును కలిసి మరోమారు తమ విజ్ఞాపనను తీసుకెళతామని స్పష్టం చేశారు. మహేంద్ర (మేదరి) జిల్లా అధ్యక్షుడిగా జోరిగే నాగేశ్వరరావు, సెక్రెటరీగా అంకుల్ క్రాంతికుమార్, కోశాధికారిగా ధూళిపాల రాంప్రసాద్, ప్రచార కార్యదర్శిగా పాతకోట నాగ వీరబాబు, జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులుగా పాతకోట కుమారస్వామి, సెక్రెటరీగా రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కోడె జయలక్ష్మి తదితర సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత మేదరి జెండాను గుంటూరుకు చెందిన రిటైర్డ్ తహసీల్దార్, సంఘం గౌరవ అధ్యక్షుడు దూళిపాల ఏసుబాబు ఆవిష్కరించారు. మేదరి సంఘం లోగోను రాష్ట్ర అధ్యక్షుడు జోరిగే మస్తానరావు ఆవిష్కరించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు సాలువ పూల దండలతో ఘనంగా సత్కరించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా కార్యవర్గ సభ్యులు

ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణంపై అభ్యంతరం

కొయ్యలగూడెం: పరింపూడి పశు వైద్యశాల ప్రక్కన నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌పై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత ఇరవై ఏళ్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా కొందరి ప్రయోజనం కోసం దానిని తొలగించి ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయడంపై ఆదివారం వివాదం చెలరేగింది. నాలుగు రోడ్ల జంక్షన్ మలుపులో నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ ప్రాంతంలో బాలుర, బాలికల హైస్కూళ్లు, ఎంపీపీ స్కూల్‌తో పాటు మండల పరిషత్ కార్యాలయం, మరో ఆరు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే రాకపోకలు సాగించడం వలన ప్రమాదాలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలకు అడ్డు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫెన్సింగ్ నిర్మించే స్థలం కూడా లేకుండా ఏర్పాటు చేస్తే ప్రమాదాలు ఉత్పన్నమవుతాయన్నారు. దీనిపై ఎంపీడీవో, విద్యుత్ శాఖ అధికారులకు, పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఫిర్యాదు చేశామని స్థానికులు పేర్కొన్నారు.



కొయ్యలగూడెం పశు వైద్యశాల పక్కన నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ

అంగన్‌వాడీలపై పని భారం తగ్గించాలి

చింతలపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల పేరుతో విపరీతమైన పని భారం మోపుతున్నారని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి అన్నారు. ఆదివారం చింతలపూడిలో నిర్వహించిన అంగన్‌వాడీ ప్రాజెక్ట్ మహాసభ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ జీతం మూరెడు పని భారం బారెడులా అంగన్‌వాడీలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభకు చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సరోజిని, టి.మాణిక్యం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. జిల్లా కమిటీ సభ్యురాలు బీజేఎం కుమారి మాట్లాడుతూ 2024లో రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ జేఏసీకి ఇచ్చిన అనేక హామీలను నేటికీ నెరవేర్చలేదని వెంటనే అంగన్‌వాడీలకు తెలంగాణ రాష్ట్రంలో వలే వేతనాలు పెంచి అంగీకరించిన వాటికి జీవోలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నత్త వెంకటేశ్వరరావు, బాలరాజు, ఎస్.సరోజిని, ఎ.సరళాదేవి, ఫణివర్ధిని, ఈశ్వరి, సత్యవతి, అరుణ కుమారి, నాగమణి, హేమలత, చెన్నకేశ్వరి, పావ రత్నం, పూజ దేవి, మరియమ్మ, ఝాన్సీ, బాబి తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి

ఊపందుకున్న వరి నాట్లు

పెదవేగి: గోదావరి నీటితో మెట్ట ప్రాంత రైతులు కొద్దిపాటి ఊరటను పొందారు. సాగు పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. మెట్ట గ్రామాల్లోనూ, బోర్లు కింద ఉన్న పొలాల్లో నాట్లు సగం మేరకు పూర్తయ్యాయి. కొన్ని గ్రామాల్లో అయితే వర్షపాతం చాలక ప్రత్యామ్నాయ పంటలు వేయాలా? ఆలస్యంగానైనా వరినే కొనసాగించాలా అనే సందిగ్ధంలో ఉండగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నాట్లు ఊపందుకున్నాయి. పెదవేగి రైతులు మొక్కజొన్న వైపు దృష్టి సారించారు. వేగివాడ దిగువ గ్రామాల్లో యథావిధిగా వరి నాట్లు శరవేగంగా వేస్తున్నారు.



వేగివాడలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

పెదపాడు: మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల పరిశోధనకు డాగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసి అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల సరఫరాను నిలుపుదల చేసేందుకు పోలీసుశాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

వర్షాకాలం.. వ్యాధుల గాలం



పెదకడిమి ప్రారంభంలో పలకరిస్తున్న చెత్తాచెదారం



కొప్పాక పెట్రోల్ బంక్ సమీపంలో అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- పరిశుభ్రతకు ప్రాధాన్యం
- కలుషిత ఆహారం, నీరు ప్రమాదకరం

పెదవేగి: వర్షాకాలం అడపా, దడపా కురుస్తున్న వర్షాలకు పాత నీటితో కొత్త నీరు కలుస్తుంది. దీంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం లలోపించి దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలుతాయి. తొలకరి వర్షాలతో వాతావరణంలో వచ్చే మార్పులు ఇంటి పరిసరాల్లో నిలిచే మురుగు నీటితో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. మలేరియా, చికున్ గున్యా, డయేరియా, డెంగీ, ఫైలేరియా, స్వైన్‌ఫ్లూ వంటి సీజనల్ వ్యాధులు ఏటా ప్రజలను భయపెడుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అసలే కరోనా వ్యాప్తి ముమ్మరంగా ప్రభలుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉంటూ, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. డ్రెయినేజీలోని పూడికను ఎప్పటికప్పుడు తీసి నీరు నిల్వ లేకుండా చూడాలి. మురుగు నీరు తొలగించిన తరువాత ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లాలి. దోమల నివారణకు మందును పిచికారీ చేయించాలి. తాగునీరు కలుషితం కాకుండా చూసుకుంటూ రక్షిత మంచినీరు పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన కల్పించి, వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో కొబ్బరి బొండాల వ్యాపారాలు, హోటళ్ల నిర్వాహకులకు చెత్తను గ్రామ పరిసరాల్లో వేయకుండా అవగాహన కల్పించాలి. ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలి. కూరగాయలు వండే ముందు వాటిని శుభ్రం చేయాలి. వర్షాకాలంలో వీలైనంత వరకు మాంసాహారానికి దూరంగా ఉండాలి. జ్వరం, దగ్గు, తలనొప్పి ఉంటే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. కలుషితమైన, నిల్వ చేసిన ఆహారం తినకూడదు.

వ్యాధులపై అశ్రద్ధ వహించొద్దు

వర్షాకాలం, పైగా కరోనా వైరస్‌తో కేసులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రజలు వ్యాధుల విషయంలో అశ్రద్ధ చేయొద్దు. ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగీ, అతిసారం ప్రబలే అవకాశం ఉంది. కలుషిత ఆహారం నీరు తీసుకోవటం ద్వారా డయేరియా వ్యాప్తి చెందుతుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వేడి చల్లార్చిన నీటిని తాగాలి. డయేరియా వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి.

– మల్లిఖార్జున్, వైద్యాధికారి, పెదవేగి పీహెచ్‌సీ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుట్టాయగూడెం: మండలంలోని రామారావుపేట సెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 14వ తేదీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామారావుపేట సబ్‌సెంటర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

టి.నరసాపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. బండివారిగూడెం గ్రామంలో మేడిద సుబ్బయ్య ట్రస్టు ఆధ్వర్యంలో రాణా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొవ్వాడ విశ్వనాథాచారి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్రం అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్యామ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ 50 శాతం మార్కులు సాధించాలని, పీహెచ్‌డీ లేదా ఎంఫిల్ చేసిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. అభ్యర్థులు 15వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందజేయాలన్నారు. 17వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కొయ్యలగూడెం: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. చొప్ప రామన్నగూడెంలో సీఐ బాల సురేష్ ఆధ్వర్యంలో దాడి చేయగా వారి నుంచి రూ.42,800 నగదు, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి సమాచారాన్ని డయల్ 112 లేదా 9440796666 ద్వారా అందిస్తే, జూదరులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం నేర్పుతామని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నేత బెజవాడ నరసింహంతో కలిసి ఆయన మాట్లాడారు. పట్టపగలు నడిరోడ్డు మీద జిల్లా పరిషత్ చైర్మన్‌పై కూటమినేతలు చేసిన దాడి దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దోషులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలన్నారు. బీసీలను చిన్నచూపు చూస్తే సహించేది లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి, డీజీపీ వెంటనే జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌పై జరిగిన దాడిని సీరియస్‌గా పరిగణించి నిందితులను అరెస్టుచేసి వారిపై క్రిమినల్‌కేసులు నమోదుచేయాలన్నారు. వారం రోజుల్లోనే రాష్ట్ర బీసీ సంఘంతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ కార్యక్రమాలకు ఉచితంగా మైక్ సిస్టం

దెందులూరు: మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలకు, వైఎస్సార్ సీపీ నేతల కుటుంబ సభ్యుల శుభకార్యాలకు ఉచితంగా మైక్ సిస్టం స్టీరియో బాక్సులు అందజేస్తామని ముప్పవరం పంచాయతీ కండ్రిగ నరసింహపురం పార్టీ యువనేత మాండ్రు మధుబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ చివరి వారం నుంచి ఉచితంగా మైక్ సిస్టం స్టీరియో ఇస్తామని తెలిపారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.